

మాలకొండ హుండీల ఆదాయం రూ.1.25 కోట్లు


వలేటివారిపాలెం, జూన్ 21 : మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి 12 శనివారాలకుగాను 34 హుండీల ద్వారా రూ.1,25,69,286 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మాలకొండలోని కల్యాణ మండపంలో శుక్రవారం కందుకూరు గ్రూప్ టెంపుల్ కార్యనిర్వాహణాధికారులు వై. భైరాగి చౌదరి, వీవీఎల్ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. నగదుతోపాటు 271 గ్రాముల బంగారం, 2.03 కిలోల వెండి, 250 యూఎస్ డాలర్లు, 2 వేల నిప్పోన్‌గొంకో డాలర్లు, 200 యూఏఈ డైమండ్స్, 12 సింగపూర్ డాలర్లు, 20 ఎన్‌రోస్ డాలర్లు, 1 బూటాన్ డాలర్, 200 ఇంగ్లండ్ పౌండ్స్ లభించాయి.





...అనే నేను

"...అనే నేను శాసనసభ్యునిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని, నేను స్వీకరించబోయే కర్తవ్యాలను శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను' అంటూ జిల్లాలో కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ప్రజలు పెట్టుకున్న ఆశలు, అప్పగించిన ఆశయాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఎమ్మెల్యే గర్వంగా ప్రమాణస్వీకారం చేయడం విశేషం. అసెంబ్లీ సమావేశాల తొలిరోజునే జిల్లాలోని ఎనిమది మంది ఎమ్మెల్యేలూ ప్రమాణస్వీకారం పూర్తి చేశారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిలతోపాటు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు ప్రమాణం చేశారు. వీరిలో ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆనం రామనారాయణరెడ్డి ఆరోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెట్టగా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. పొంగూరు నారాయణ గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికై మంత్రిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వీరంతా ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాలను నిలబెట్టుకుంటామంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రతినబూనారు. శుక్రవారం నుంచి అధికారికంగా శాసనసభ్యుల హోదాలో వీరంతా ప్రజాసేవలో తరించనున్న నేపథ్యంలో వారి అంతరంగం వారి మాటల్లోనే...



- అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం
- సీనియర్లు, జూనియర్లతో కూడిన టీం
- తొలిసారిగా అసెంబ్లీకి నలుగురు ఎమ్మెల్యేలు
- నియోజకవర్గాల అభివృద్ధే అందరి ధ్యేయం
- 'ఆంధ్రజ్యోతి'తో శాసనసభ్యుల మనోగతం

బాధ్యతగా పని చేస్తా

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేశా. ఇప్పుడు మరింత బాధ్యతగా పని చేస్తా. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే నా ధ్యేయం. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. పార్టీ కోసం చెమటోడ్చిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది. కార్యకర్తల సంక్షేమాన్ని ప్రత్యేకంగా తీసుకుంటా. జిల్లా అభివృద్ధికి నా అనుభవంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి




ప్రమాణస్వీకారం అనంతరం అభివాదం చేస్తున్న మంత్రి ఆనం

నా ప్రథమ కర్తవ్యం 'ప్రకాశం'లో కలవడమే!



కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడమే నా ప్రథమ ప్రాధాన్యం. అలాగే రామాయపట్నం పోర్టు అనుబంధంగా, నియోజకవర్గవ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటు జరిగేలా చూసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల జలాశయం నుంచి రావాల్సిన 1.5 టీఎంసీల నీరు పూర్తిస్థాయిలో ఏటా వచ్చేలా చూస్తాను. అలాగే కందుకూరు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పని చేస్తా. సాగునీటి కొరత ఉన్న వలేటివారిపాలెం మండలం వంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తా. చంద్రబాబు, లోకేష్‌ల ప్రోత్సాహం, మంత్రివర్గ పెద్దల తోడ్పాటుతో నియోజకవర్గ అభివృద్ధిలో నా ముద్ర వేయగలనన్న నమ్మకం ఉంది.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు



యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు

ముప్పై ఏళ్ల తరువాత నెల్లూరు నగర నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉంది. 71వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో నాకు భారీ విజయం తెచ్చిపెట్టారు. ప్రజల రుణం తీర్చేలా నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. నెల్లూరు సిటీలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. అలాగే నియోజక వర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామీద నమ్మకంతో రాజధాని నిర్మాణ బాధ్యతను అప్పగించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి. నిర్ణయించుకున్న గడువు లోపు అద్భుతమైన రాజధానిని నిర్మించాలి.

- పొంగూరు నారాయణ, నెల్లూరు సిటీ

నీటి సౌకర్యం, ఉపాధి కల్పనే లక్ష్యం



ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి కష్టాల తోపాటు వలసల నివారణకు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. ఈ మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టా. నియోజకవర్గంలోని ఏ పల్లెలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చోట శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటు చేయిస్తాను. పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి పనులు చేపడతాం. అన్నిరంగాల్లో వెనుకబడిన ఉదయగిరి ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

- కాకర్ల సురేష్, ఉదయగిరి

అభివృద్ధితో కృతజ్ఞత చాటుకుంటా



కేవలం 22 రోజుల వ్యవధి లోనే కోవూరు నియోజక వర్గ ప్రజలు నా వెంట నిలబడి భారీ మెజార్టీతో దీవించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చాను. ఆ మాట నిజం చేసి చూపిస్తా. నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొస్తా. ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తా. అన్ని విధాలుగా నియోజవర్గాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలపట్ల ఉన్న కృతజ్ఞతను చాటుకుంటా.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు

కావలి అభివృద్ధికి కృషి



ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా. తీరప్రాంత ప్రజలు రాకపోకలు సాగించే కావలి-తుమ్మల పెంట రోడ్డు నిర్మాణా నికి తొలి ప్రాధాన్యత ఇస్తా. అధ్వానంగా ఉన్న కావలి-ముసునూరు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా. అసంపూర్తిగా ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి చేసి మత్స్యకారుల చిరకాల కల నెరవేరుస్తా. ముసునూరు బైపాస్ నుంచి మద్దూరుపాడు వరకు రైల్వే ట్రాక్‌కు పడమర లింక్ రోడ్డు నిర్మించి, కావలిలోకి వాహనాల రద్దీని తగ్గించేందుకు కృషి చేస్తాను. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న రోడ్లతోపాటు ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతా.

- దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కావలి

మరింత అభివృద్ధి చేస్తా



నెల్లూరురూరల్ నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి ప్రమాణ స్వీకారం చేయడం గర్వంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల సహకారంతో రూరల్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తా. కక్ష సాధింపులు ఉండవు. ప్రశాంత వాతావరణమే లక్ష్యం. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన న్యాయం చేస్తా. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా. నియోజకవర్గంలో పెండింగ్ పనుల పూర్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి బృందం)



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో యోగా చేస్తున్న పోలీస్ సిబ్బంది



ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో టైగర్ కారిడార్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర అటవీ శాఖకు పంపింది. ఇటు శేషాచలం నుంచి అటు నల్లమల అడవుల మధ్యనున్న తిరుపతి, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కలుపుతూ ఈ టైగర్ కారిడార్ ఏర్పాటు కానుంది.

ఉమ్మడి నెల్లూరులో టైగర్ కారిడార్

- నాలుగు జిల్లాలను కలుపుతూ ఏర్పాటు
- పెద్ద పులుల సంచారంతోనే నిర్ణయం
- ఇప్పటికే కేంద్రానికి చేరిన ప్రతిపాదనలు
- అటవీ సిబ్బందికీ శిక్షణ పూర్తి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 21: నెల్లూరు-కడప జిల్లాల మధ్యనున్న అటవీ ప్రాంతంలో కొన్నేళ్లుగా పెద్దపులుల సంచారం పెరుగుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. రెండేళ్ల క్రితం ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో ఓ ఆడ పులి పాదముద్రలను గుర్తించారు. తాజాగా మర్రిపాడు మండలం కదిరినాయుడిపల్లి వద్ద మగ పులికి చెందిన పాదముద్రలను అటవీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో టైగర్‌కారిడార్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలనే దానిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వెంకటగిరి, ఆత్మకూరు, రాపూరు, ఉదయగిరి రేంజ్‌లలో దాదాపు 1.50 లక్షల హెక్టార్లు టైగర్ కారిడార్ పరిధిలోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ మేరకు పూర్తిస్థాయి నివేదికలను జిల్లా అధికారులు రాష్ట్ర కార్యాలయానికి పంపారు. అయితే, ఈ టైగర్ కారిడార్ దాదాపు నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండనున్నది. నెల్లూరు జిల్లాలోని నాలుగు రేంజ్‌లతో పాటు తిరుపతి జిల్లాలోని పలు రేంజ్‌లు, కడప పరిధిలో బద్వేల్, ప్రొద్దుటూరు రేంజ్‌లు, ప్రకాశం జిల్లా గిద్దలూరు పరిధిలో కనిగిరి రేంజ్ ఇలా నాలుగు జిల్లాల అటవీ ప్రాంతంలో దాదాపు 4 లక్షల హెక్టార్లలో ఈ టైగర్ కారిడార్ ఏర్పాటు కానుంది. కారిడార్ ఏర్పాటుపై ఇప్పటికే జిల్లాలో అటవీ అధికారులకు, సిబ్బందికి నాగార్జునసాగర్ టైగర్ రిజర్వుఫారెస్ట్ పరిధిలోని సున్నిపెంటలోని ప్రత్యేక ప్రావీణ్యం ఉన్న అధికారులతో శిక్షణ ఇచ్చారు. టైగర్ కారిడార్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఎలా ఏర్పాటు చేయాలి? కారిడార్ ప్రాంతాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

● ప్రత్యేక కార్యచరణ అవసరం

టైగర్ కారిడార్‌లో తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అటవీ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కారిడార్ పరిధిలో అనేక చోట్ల కెమెరాల ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించారు. అదేవిధంగా పెద్దపులులు సంచరించే ప్రాంతాల్లో జింకలను, కణుజులను ఎక్కువగా పెంచాల్సి ఉంటుంది. ఆహారంగా వాటిని పులి తీసుకుంటుంది. అదేవిధంగా మంచినీటి తొట్టెలనూ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇక పెద్దపులులు తిరిగే ప్రాంతాల్లో చెట్లను నరకకూడదు. తరచూ అటవీ అధికారులు క్యాంపులను ఏర్పాటు చేసి అడవుల్లో చేయాల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అదే విధంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అడవుల్లోకి వెళ్లకుండా చూడాలి. హెచ్చరిక బోర్డులనూ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

● టైగర్ కారిడార్‌పై ప్రతిపాదనలు పంపాం



మర్రిపాడు ప్రాంతంలో సేకరించిన పెద్దపులి పాదముద్రలను చూపుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్ (ఫైల్)

నెల్లూరు జిల్లాలో పెద్దపులుల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో టైగర్ కారిడార్ ఏర్పాటు అనివార్యం కానుంది. అందుకోసం రాష్ట్రప్రభుత్వం తరఫున కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. నెల్లూరు జిల్లాలో రాపూరు, ఉదయగిరి, వెంకటగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలో ఈ టైగర్ కారిడార్ ఏర్పాటుకానుంది.

- చంద్రశేఖర్, నెల్లూరు డీఎఫ్‌వో

రేపటి నుంచి గురువాయురప్పన్ ఆలయ పుష్కర మహా సంప్రోక్షణ

నెల్లూరు (సాంస్కృతికం) : నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంగణంలో ఉన్న గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఆదివారం నుంచి 26వతేదీ వరకు పుష్కర మహాసంప్రోక్షణ అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ జీ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య తెలిపారు. ఈ నెల 27 నుంచి జూలై 2వతేదీ వరకు బ్రహ్మోత్సవాలు కూడా జరుగుతాయని పేర్కొన్నారు. 27న ఉదయం 108 కలిశాలతో అభిషేకం, గోపూజ, అదేరోజు సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 28వ తేదీ ఉదయం ధ్వజారోహణ, సుదర్శన హోమం, రాత్రి శేష వాహన సేవలు జరుగుతాయని తెలిపారు. 29వతేదీ ఉదయం విశేష హోమాలు, రాత్రి హనుమంతసేవ, 30వ తేదీ ఉదయం నిత్యపూజలు, హోమాలు, జూలై 1వతేదీ మహాకుంభా రాధన, తిరుకల్యాణం జరుగుతాయన్నారు. 2న ఉదయం చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

సోమశిలలో 9.984 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 21: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 2,735 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.984 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కులు నీరు కొనసాగుతోంది.



ముఖ్యమంత్రి చంద్రబాబును సన్మానిస్తున్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

ముఖ్యమంత్రిని కలిసిన పోలంరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాబును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ విజయం కోసం కష్టపడిన మీకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని, పార్టీలో మంచి స్థానం కల్పిస్తా మని చంద్రబాబు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య కూడా ఉన్నారు.

'ఫీవర్'ను ప్రారంభించండి

- రూ. 3.82 కోట్లతో గోషా ఆసుపత్రి నిర్మాణం
- 100 పడకలతో ఏర్పాటు
- కానీ ప్రారంభించని ప్రభుత్వం
- వైద్య పరికరాలు, వైద్యుల నియామకమూ పెండింగ్!
- కొత్త ప్రభుత్వంపై ఆశలు



నెల్లూరు (వైద్యం), జూన్ 21 : నెల్లూరు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైద్య ఆరోగ్య శాఖ స్థలంలో చేపట్టిన గోషా ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. ఈ 100 పడకల వైద్యశాలను రూ. 3.82 కోట్ల వ్యయంతో మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం నిర్మించింది. నిర్వహణ బాధ్యతను వైద్య ఆరోగ్యశాఖ చేపడుతుంది. పైగా దీనికి ఫీవర్ ఆసుపత్రిగా ఆ శాఖ పేరు నమోదు చేసింది. ఇందులో వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని 6 నెలల క్రితమే వైద్యాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. గుంటూరులో ఉన్న ఫీవర్ ఆసుపత్రి లాంటిదే నెల్లూరులోనూ అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం 2021 జనవరిలో గోషా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టింది. అయితే నిర్మాణం పూర్త యినా ప్రారంభానికి నోచుకోలేదు. ఇటీవల కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం నూతన ఫీవర్ వైద్యశాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు ఆశిస్తున్నారు.

వైద్యులు, సిబ్బంది నియామకం ఎప్పుడు..?

గోషా ఆసుపత్రికి 15 మంది వైద్య నిపుణులను నియమించాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీరిలో ఇద్దరు ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, ఇద్దరు గైనకాలజిస్టులు, జనరల్ ఫిజిషీయన్ ఒకరు ఉండాలని, మిగిలిన వైద్యులు సాధారణ వ్యాధుల చికిత్సకు నియమించాలని భావించింది. అలాగే 25 మంది స్టాఫ్‌నర్సులు, 10 మంది ఏఎన్ఎంలు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను కూడా నియమించాలని ప్రతిపాదనల్లో కోరింది. కార్యాలయం సిబ్బందిగా యూడీసీ, ఎల్‌డీసీతో పాటు టైప్‌రైటర్ నియామకం చేపట్టాలని పేర్కొంది. అయితే ఈ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గత వైసీపీ ప్రభుత్వంలోనే నిర్మాణాలు పూర్తియినా ఆసుపత్రిలో వైద్య పరికరాలను ఏర్పాటు చేయలేదు. కొత్త ప్రభుత్వం ఎంత తొందరగా పరికరాలు సమకూర్చి, వైద్యులు, సిబ్బందిని నియమిస్తే అంత తొందరగా ఈ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు ప్రారంభించే అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనలు పంపాం



గోషా ఆసుపత్రి(ఫీవర్ ఆసుపత్రి)కి వైద్యులు, సిబ్బంది కావాలని ఆరు నెలల క్రితమే ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నియామకాలు చేపట్టలేదు. వైద్య పరికరాలు కూడా అవసరం. ఈ విషయాన్ని జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

స్కూల్ బస్.. ఫిట్‌లెస్!

- ఎఫ్‌సీకి దూరంగా 587 బస్సులు
- విద్యాసంస్థల యాజమాన్యం నిర్లక్ష్యం
- తనిఖీల్లో వాహనాలను సీజ్ చేస్తున్న రవాణా శాఖ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 21 : ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న వాహనాల ఫిట్నెస్‌పై అనేక అనుమానాలు రేగుతున్నాయి. విద్యాసంస్థలు పునఃప్రారంభమై రెండువారాలు గడుస్తున్నా ఇప్పటివరకు రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందని వాహ నాలు వందల్లోనే ఉంటున్నాయి. దీంతో ఇప్పటికే ఆ శాఖ అధికారులు జరిపిన దాడుల్లో రోడ్లపై తిరుగు తున్న మూడు విద్యాసంస్థల బస్సులను సీజ్ చేశారు.

32 రకాల నిబంధనలు..

విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థల బస్సులకు 32 రకాల నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ నిబంధనలు పాటించిన వాహనాలకే రవాణా శాఖ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది.

- విద్యాసంస్థ బస్సు డ్రైవర్ వయసు 60 సంవత్సరాలు మించి ఉండకూడదు.
- డ్రైవర్ వ్యక్తిగత హెల్త్‌కార్డును నిర్వహించాలి. ప్రతి మూడు నెలలకు విద్యాసంస్థల యాజమాన్యాలే తమ సొంత ఖర్చుతో డ్రైవర్‌కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులో పొందుపరచాలి.
- డ్రైవర్ నియామకం గురించి తల్లిదండ్రుల కమిటీకి తెలియజేయాలి. అలాగే డ్రైవింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- వాహన కండీషన్‌ను నెలకోసారి ప్రిన్సిపాల్, తల్లిదండ్రుల కమిటీ తనిఖీ చేయాల్సి ఉంటుంది.
- ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలి.
- బస్సు ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి ఉంచాలి.
- బస్సులో సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు ఉంచుకొనేందుకు అరలు ఏర్పాటు చేయాలి.
- బస్సులో అక్కడక్కడా నిలువు స్తంభాలు, కప్పును, బస్సు పైభాగాన్ని కలుపుతూ ఏర్పాటు చేయాలి.



ఎఫ్‌సీ లేని బస్సులను సీజ్ చేస్తున్న రవాణాశాఖ అధికారి(ఫైల్)

ఫిట్‌నెస్‌కు దూరంగా బస్సులు

జిల్లాలోని నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు ఆర్‌టీవో కార్యాలయాల పరిధిలో 1,517 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఈ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణాశాఖ అధికారులు మంజూరు చేయాల్సి ఉంది. అయితే, విద్యాసంస్థలు పునఃప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు 930 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందాయి. మిగిలిన 587 బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉంటున్నాయి.

విద్యాసంస్థల బస్సుల వివరాలు

ప్రాంతం	బస్సులు	ఫిట్నెస్ పొందినవి	ఫిట్నెస్ పొందనవి
నెల్లూరు	1043	698	345
కావలి	247	100	147
ఆత్మకూరు	128	78	50
కందుకూరు	99	54	45
	1517	930	587

చిరుత దాడి చేసిందని వదంతులు



మృతిచెందిన మేక



అటవీ శాఖ అధికారులు గుర్తిస్తున్న అడుగులు

ఉదయగిరి, జూన్ 21: పట్టణ శివారు ప్రాంతంలో మేకపై చిరుత దాడి చేసిందన్న వదంతులు శుక్రవారం దావనంలా వ్యాపించాయి. స్థానికులు అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని మంగళకట్టకు చెందిన బాబు ప్రతి రోజూ తన మేకలను మేత కోసం దుర్గంవైపు తోలుకెళతాడు. అందులో భాగంగా గురువారం మేతకు వెళ్లిన మేకల మందలో ఓ మేక తప్పిపోయింది. చీకటి పడడంతో శుక్రవారం ఉదయం మేకను వెతికేందుకు దుర్గం రోడ్డు వైపు వెళ్లాడు. స్థానిక అటవీ శాఖ నర్సరీ వైపున్న మేక కళేబరాన్ని గమనించాడు. మేక గొంతు నమిలిన గాయాలతో చనిపోవడంతో యజమాని చిరుత పులి దాడి చేసి ఉంటుందని అనుమానంతో అటవీ శాఖ, పోలీసులు, స్థానికులకు సమాచారం చేరవేశాడు. సీఐ గిరిబాబు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అక్కడికి వచ్చిన అటవీ శాఖాధికారులు మేక కళేబరాన్ని పరిశీలించి చుట్టుపక్కల గాలించి అడుగులను గుర్తించారు. ఈ విషయంపై రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డిని వివరణ కోరగా మేకను చంపింది చిరుతుపులి కాదని, రేచు కుక్కల దాడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. చిరుత దాడి అవాస్తమని, అలాంటి వదంతులు ప్రజలు నమ్మవద్దన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ దగ్ధం

తోటపల్లిగూడూరు, జూన్ 21 : మండలంలోని కోడూరు పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ గురువారం రాత్రి దగ్ధమైంది. టీడీపీ నాయకుల వివరాలు మేరకు.. గత కొంతకాలంగా ఓ వైసీపీ నేత దగ్గరే పంచాయతీ ట్రాక్టర్ ఉండడంతో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆక్వా కల్చర్ ఏరియేటర్లను తగలబెట్టారు. దీంతో ఆ పక్కనే ఉన్న పంచాయతీ ట్రాక్టర్ కూడా దగ్ధమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మౌనం వహించడం విశేషం. గత మూడు రోజుల క్రితం టీడీపీ నాయకులు ట్రాక్టర్ విషయంపై నిలదీసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రజలకు ఏమి సమాధానం చెప్తారని ప్రశ్నిస్తున్నారు.

బాణాసంచా పేలి గోడౌన్ నేలమట్టం

ఇందుకూరుపేట, జూన్ 21 : మండలంలోని మైపాడు గ్రామం శివారు ప్రాంతంలో ఎలాంటి అనుమ తులు లేకుండా బాణాసంచా తయా రుచేస్తున్న గోడౌన్ శుక్రవారం ప్రమాదవశాత్తు బాణాసంచా పేలి నేలమ ట్టం అయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ సంఘటనతో మైపాడు గ్రామ ప్రజలు భయాందోళన చెందారు.

సంతకాల ఫోర్జరీ స్కాంలో నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ వికాస్
- పూర్వ కమిషనర్ సంతకాలూ ఫోర్జరీ?

నెల్లూరు(సిటీ), జూన్ 21 : నెల్లూరు కార్పొరేషన్‌లో ఇటీవల వెలుగు చూసిన కమిషనర్ సంతకాల ఫోర్జరీ కుంభకోణంలో నలుగురిపై వేటు పడింది. ఆ స్కాంతో సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు సిటీ ప్లానింగ్ విభాగం ఉద్యోగులను విధులనుంచి తప్పిస్తూ కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ముందస్తు విచారణలో భాగంగా సిటీ ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న బీ ప్రవీణ్, ఎం దేవేంద్ర, 12వ డివిజన్ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ పీ నాగేంద్రబాబు, 24వ డివిజన్ ప్లానింగ్ సెక్రటరీ కే కార్తీక్‌మాలవ్యను సస్పెండ్ చేస్తున్నామని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్కాంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రాగానే షోకాజు నోటీసులు జారీ చేయగా అందుకు వారి నుంచి సంతృప్తికరంగా సమాధానం రానందున ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. వీరితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎల్‌టీపీ దిలీప్‌కుమార్‌కు నోటీసులు జారీ చేశామని, ఆయన వద్దనుంచి లిఖితపూర్వక వివరణ వచ్చాక తదుపరి చర్యలుంటాయని వివరించారు. కాగా, సస్పెండ్ అయిన ప్రవీణ్ స్థానంలో దశయ్య, దేవేంద్ర స్థానంలో ప్రకాష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. పూర్వ కమిషనర్ డీ హరిత సంతకాలు కూడా ఫోర్జరీ అయినట్లు ఆరోపణలు వచ్చాయని, వాటిపైనా విజిలెన్స్ విచారణ కోరుతూ ఆ శాఖ డీజీకి లేఖ రాశామని కమిషనర్ తెలిపారు.

'ఫోర్జరీ' స్కాంలో నలుగురు కార్పొరేటర్లు: టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సిటీ): ఫోర్జరీ స్కాంలో వైసీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్ల పాత్ర ప్రముఖంగా ఉందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై లోతైన విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం లో కమిషనర్ వికాస్ మర్మత్‌ను కలిసి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ కార్పొ రేటర్లు లైసెన్స్‌డ్ ఇంజనీరును బెదిరించి సంతకాల ఫోర్జరీకి పాల్పడినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. విచారణలో జాప్యం జరిగితే ఉన్నత స్థాయికి ఫిర్యాదు చేస్తామని కమిషనర్‌కు తెలిపామన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6922
వెండి కిలో ధర	రూ. 93,000
వెండి ఒక గ్రాము	రూ. 95.00

ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి పడి ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 21: నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు... శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి వంతెనపైనుంచి కింద పడటంతో తలకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. అక్కడే ఉన్న చిరు వ్యాపారస్తులు గమనించి వెంటనే ఆటోలో వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న నవాబుపేట పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏదైనా వాహన ఢీకొందా, ప్రమాదవశాత్తు జారి పడ్డాడా?, ఎవరైనా తోసేశారా, ఆత్మహత్య చేసుకున్నాడా..? ఇలా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహం వద్ద కావలి నుంచి నెల్లూరు వచ్చినట్లు బస్ టికెట్టు తప్ప, ఇతర వివరాలు లభ్యం కాలేదు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు నవాబుపేట పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బాబీ కోరారు.

వైసీపీ నేత అక్రమ లేఅవుట్!

- ప్రభుత్వ భూమి అని రెవెన్యూ శాఖ బోర్డు ఏర్పాటు
- సర్వే రాళ్లను సైతం తొలగించిన అధికారులు
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు

అల్లూరు, జూన్ 21 : వైసీపీ ప్రభుత్వంలో స్థానిక వైసీపీ నేత వేసిన లేఅవుట్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేశారంటూ రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సదరు లేఅవుట్‌లోని సర్వే రాళ్లను సైతం తొలగించారు. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. అదేవిధంగా సదరు లేఅవుట్‌లో స్థలాలను కొనుగోలు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామని ఇప్పుడు తమ గతేంటని లబోదిబోమంటున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు దుర్గేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరుపేట పరిధిలోని 4525-ఎ, 4525-బి సర్వే నెంబర్లలో 3.82 ఎకరాలు రెవెన్యూ రికార్డుల ప్రకారం గుంట పోరంబోకు భూమిగా ఉందని, సదరు భూమిలో గత ప్రభుత్వంలో కొంత మంది అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేశారన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించగా గుంట పోరంబోకు భూమిగా గుర్తించామని, సదరు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లను తొలగించామని ఆయన పేర్కొన్నారు. ఈ భూమిని ఎవరైనా ఆక్రమించాలని ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



లేఅవుట్లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



అధికారులు తొలగించిన సర్వే రాళ్లు

పవన్‌ను కలిసిన వేమిరెడ్డి దంపతులు



నెల్లూరు(హరనాథపురం) : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పవన్ కార్యాలయంలో వేమిరెడ్డి తనయుడు అర్జున్‌రెడ్డితో కలిసి వారు భేటీ అయ్యారు. అలాగే, విజయవాడలోని ఓ హోటల్‌లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని టీడీపీ ఎన్ఆర్ఐ మహిళా విభాగం అధ్యక్షురాలు శివాణి ఆధ్వర్యంలో సత్కరించారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

- ప్రభుత్వం నుంచి కుటుంబానికి రూ.లక్ష సాయం
- మంత్రి పొంగూరు నారాయణ




బాధితులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 21: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. నెల్లూరులోని బర్మాషెల్ గుంటలో గురువారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శుక్రవారం మంత్రి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారికి అండగా ఉంటామని భరోసా కల్పిం చారు. అగ్ని ప్రమాదంలో నివాసాలు దగ్ధం కావడం, ఓ వికలాంగ మహిళ సజీవ దహనం కావడం కలచివేసిందన్నారు. ప్రమాద విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని, వెంటనే ఆయన స్పందించి బాధిత కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించమని చెప్పారన్నారు. ఇళ్లు కాలిపోయిన బాధితులందరికి నెల రోజుల్లో ఇళ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా టిడ్కో గృహాల్లో వసతి కల్పించినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి నారాయణ వైద్యశాలలో ఉచితంగా చికిత్సలు అందిస్తామ న్నారు. బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులు రూ.15 వేలు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం హరినారాయణన్, కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీవో మలోల, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు తాళ్లపాక అనురాధ, వినోద్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సాయం..

నెల్లూరు (వైద్యం): అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ శుక్రవారం సాయం అందించింది. టార్పాలిన్ పట్టలు, హైజిన్ కిట్‌లు, వంట సామగ్రి వంటి వస్తువులను రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు అందచేశారు. ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వారికి రెడ్‌క్రాస్ ద్వారా నిత్యావసర వస్తువులతోపాటు బియ్యం, వంట సామగ్రి అందించామని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అత్యవసర సేవలు : కమిషనర్



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 20 : నగరంలోని బర్మాషెల్ గుంటలో గురువారం సంభ వించిన అగ్ని ప్రమాద బాధితులకు అత్యవసరమైన సేవలన్నీ తక్షణం అందిం చాలని నగర కమిషనర్ వికాస్ మర్మత్ అధికారు లను ఆదేశించారు. శుక్రవారం ప్రమాద ప్రాంతాన్ని సందర్శించిన ఆయన బాధితులతో మాట్లాడారు. తాగునీరు, ఆహారం, మెరుగైన పారిశుధ్యం, వైద్యం వంటి వసతు లన్నీ పూర్తి స్థాయిలో కల్పించాలని యంత్రాంగానికి సూచించారు. ఈ అగ్ని ప్రమాదంలో సర్వకోల్పోయిన వారికి కార్పొరేషన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇళ్ల పునర్నిర్మాణానికి సంబంధించి సిఫార్సు చేస్తామని చెప్పారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులైన వారందరికీ గ్యాస్ సిలిండర్లు అందించాలని అధికారులకు సూచించారు. బాధి తులను జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, కాకు మురళీరెడ్డి పరామర్శించారు.

వీఎస్‌యూలో అక్రమాలపై గవర్నర్‌కు ఫిర్యాదు



వెంకటాచలం, జూన్ 21 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై మధుసూదన్‌రావు అనే వ్యక్తి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై రాష్ట్ర గవర్నర్ స్పందించి విచారణ జరిపించాలని ఉన్నత విద్యాశాఖను ఆదేశించారు. 2022 నుంచి ప్రస్తుత యూనివర్సిటీ ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 22 మందికిపైగా కొత్త వారిని నియమించారు. 2024 జనవరి నుంచి మే నెల వరకు మరికొంత మందిని నియమించారు. ఇంకా 50 మందిని నియమించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా, ఈ కొత్త నియామకాలపై ఎవరు ప్రశ్నించినా యూనివర్సిటీ అధికా రులు సరైన సమాధానం చెప్పడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇష్టానుసారంగా జరుగుతున్న యూనివర్సిటీ నియామకాలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కొత్త ఉద్యోగ నియామకాలు, వేతనాల పెంపు చట్టవిరుద్ధంగా జరిగిం దని, దీనిపై విచారణ జరిపించాలని అందుకు సంబంధించిన అన్ని పత్రాలను ఫిర్యాదుదారుడు గవర్నర్‌కు అందించారు.

ప్రధాని చొరవతో పురోగతిలోకి రాష్ట్రం

- బీజేపీ నాయకుడు కర్నాటి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 21 : తిరోగమనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో పురోగమనంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయ రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దూరదృష్టి, అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రధానితో ఉన్న సత్సంబంధాల వల్ల రాష్ట్రం పురోగతి వైపు పరుగులు తీస్తుందన్నారు. విద్యావంతులు, విలువలు కలిగిన మంత్రులు ఉండటం రాష్ట్రానికి కలిసి వచ్చే అంశమన్నారు. గత ప్రభుత్వంలో అన్యాయాలు, అక్రమాలు, దుర్మార్గాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. అసెంబ్లీ సమావేశాలు అర్థవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, కార్యదర్శి చిలకా ప్రవీణ్ పాల్గొన్నారు.

24న ఉద్యోగమేళా

నెల్లూరు (విద్య), జూన్ 21 : నెల్లూరులోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24వతేదీన కళాశాలకు చెందిన జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నై, శ్రీసిటీకి చెందిన పలు కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ఈ దాది డిగ్రీ పూర్తి చేసుకున్న అన్ని కళాశాలల విద్యార్థినులు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9030665477 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

46 మంది హాజరు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మినీ జాబ్‌మేళాకు జిల్లా వ్యాప్తంగా 46 మంది నిరుద్యోగులు హాజరయ్యారని జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో పాల్గొన్న కంపెనీలు ప్రతిభ కనపరిచిన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశాయని తెలిపారు.

కనుల పండువగా సీతారాము కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 21 : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, శనివారం మహాత్మా గాంధీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఉదయం 9గంటలకు సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని ఆలయ పాలక మండలి ఓ ప్రకటనలో కోరింది.

హనుమంత వాహనంలో వేంకటేశ్వరుడు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 21 : నగరంలో మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వెంకటే శ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం 3వరోజుకి చేరాయి. ఉదయం నిత్య హోమం, బలిహరణం, మంగళశాసనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీవారికి పంచ కలశ స్నపనము, మంగళశాసనాలు జరిగాయి. సాయంత్రం నిత్యహోమం, మూలవర్లకు పూలంగిసేవ, అనంతరం స్వామివారికి హనుమంత వాహనంలో తిరువీధి ఉత్సవం జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 21 : ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇస్కాన్ రోడ్డులోని హనుమాన్ గుడిలో సంగీత కచేరీ జరిగింది. సంగీత ఉపాధ్యాయులు శ్రీవత్సల, ఎం ఇందిర, వారి శిష్య బృందం చేసిన కచేరీ శ్రోతలను ఆకట్టుకుంది. అనంతరం బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి గురువులను ఘనంగా సత్కరించారు.

గ్రామాల్లో కరువు కోరలు

- బతుకు భారమై ప్రజల వలస
- ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వాలు

వరికుంటపాడు, జూన్ 21: జిల్లా కేంద్రానికి శివారు మండలాలు వరికుంటపాడు, సీతారామపురం. ఈ మండలాలు మెట్ట ప్రాంతాలు కావడంతో ఒకవైపు తీవ్ర వర్షాభావం, మరోవైపు సాగునీటి వసతులు లేక వ్యవసాయ భూములు బీళ్లను తలపిస్తున్నాయి. మరికొన్నిచోట్ల కంపచెట్లతో నిండి అడవులను తలపిస్తున్నాయి. జలాశయాలు, చెరువులు అడుగంటి పోవడంతో అధిక శాతం మంది రైతులు పంటలు సాగు చేయడం లేదు. అనుభవం లేకపోయినా ఇతరరంగాల్లో కూలీలుగా అవతారం ఎత్తాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. కృష్ణంరాజుపల్లి, నల్లబోతులవారిపల్లి, అలివేలుమంగాపురం, సాతువారిపల్లి, తూర్పుపాళెం, కొండ్రాజుపల్లి, నార్త్‌కొండాయపాళెం, దక్కనూరు గ్రామాల ప్రజలు, రైతులు బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై, విజయవాడ, గుంటూరు, వైజాగ్, నెల్లూరు, ఒంగోలు, తెలంగాణ ప్రాంతాలకు కుటుంబ సమేతంగా వలసలు వెళుతున్నారు. చిన్నపాటి వ్యాపారాలు, బేల్దారి, బొగ్గు, ఇటుక బట్టీలు, హోటళ్ల ఇతరత్రా రంగాల్లో కూలి పనులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు.



అడుగంటిన గండిపాళెం జలాశయం



మరమ్మతులకు నోచుకోని కాలువ



జీవాలతో వలస వెళ్తున్న యజమానులు

గ్రామాల్లో మరింత అధ్వానం..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. వనరులున్నా ఏళ్ల తరబడి సాగునీటికి నోచుకోకపోవడంతో పల్లె ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అప్పట్లో అధికశాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. ప్రస్తుతం జీవనం భారంగా మారడంతో పొలాలను అమ్ముకొని గ్రామాలు వదిలి వెళుతున్నారు. అరకొరగా ఉన్న భూములు బీడుగా మారుతున్నాయి.

అందని సాగునీరు..

కూతవేటు దూరంలో గండిపాళెం, నక్కలగండి జలాశయాలు ఉన్నా ఫలితం లేకుండా పోయింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో రైతులకు సాగునీరు అందని ద్రాక్షగానే మారింది. గతంలో వరి, పొగాకు, బత్తాయి, రాగి, సజ్జ, పెసర వంటి పంటలు సాగుచేసి జీవనం సాగించేవారు. అయితే కాలువల్లో సాగునీరు ముందుకు సాగే అవకాశం లేదు. అధ్వానంగా మారిన కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవడంతో చెరువులు సైతం అడుగంటిపోయాయి. అలాగే పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మాణం చేపట్టిన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిలిచిపోవడంతో రైతుల ఆశలు నిరాశగానే మిగిలాయి. విద్యుత్ మోటర్లతో కొందరు రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. కనీసం మూగజీవాలు కడుపు నింపుకునేందుకు పచ్చిక మేత, తాగునీటి వసతి లేకపోవడం దారుణం. చేసేదిలేక వాటిని యజమానులు అమ్ముకుంటున్నారు.

'నేను బడికి పోతా'పై సమీక్ష

సీతారామపురం: నేను బడికిపోతా కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంఈవో, ఎంపీడీవో అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

వరికుంటపాడు, జూన్ 21: మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం యూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు రశీదులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారాయణ, సుబ్రమణ్యం, జిల్లా ప్రతినిధి ఆర్.నాగార్జున, ఎం.సుబ్బారావు, ఆర్. వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 21: ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, వినుకొండ ఎమ్మెల్యేగా అంజనేయులు విజయం సాధించడంతో శివాపురం గ్రామ టీడీపీ నాయకులు శీను ఆధ్వర్యంలో 15మంది బృందం తిరుమలకు పాదయాత్ర గా వెళుతున్నారు. ఈ క్రమంలో వారి పాదయాత్ర శుక్రవారం నర్రవాడకు చేరుకొంది. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు.

ఏ.సాగరం డీటీకి ప్రశంసలు

అనంతసాగరం, జూన్ 21: మండల డిప్యూటీ తహసీల్దారు గిరీష్‌కు ఆత్మకూరు ఆర్డీవో మధులత శుక్రవారం ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రంను అందజేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విశేష సేవలు అందజేసినందుకు ఈ ప్రశంసా లభించడంతో తోటి ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను అభినందించారు.

రాజముద్రతో పోషకాహార కిట్లు

ఉదయగిరి రూరల్, జూన్ 21: వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భవతులకు సరఫరా చేసే పోషకాహారం వస్తువులపై అప్పటి సీఎం జగన్ ఫొటోలు ఉండేవి. వాటిని తొలగించి టీడీపీ ప్రభుత్వం రాజముద్రను ముద్రించిన పోషకాహార కిట్లను కొత్తగా సరఫరా చేస్తోంది.

ఇంకా తొలగించని జగన్ ఫొటో

ఉదయగిరి, జూన్ 21: ప్రభుత్వం మారడంతో అన్నిచోట్ల ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటోలను అధికారులు తొలగిస్తున్నారు. కానీ మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి-1,2,3 సచివాలయాలపై మాజీ సీఎం జగన్ ఫొటో అలాగే వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌లపై ఉన్న నేమ్ బోర్డు, నవరత్నాల లోగోలు ఉన్నాయి.



కొండాయపాళెం సచివాలయంపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటో

ముగిసిన సంతానలక్ష్మి ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, జూన్ 21: స్థానిక బీసీకాలనీ సమీపంలో వెలసిన సంతానలక్ష్మి ఉత్సవాలు ఈ నెల 17న ప్రారంభమైన శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు వేద పండితులు హోమాలు, ధనలక్ష్మి అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్ల పొంగళ్ల కార్యక్రమంలో భాగంగా భక్తులు వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. నూతన బుట్టల్లో పొంగళ్ల సామగ్రి సమకూర్చుని స్థానిక పోలేరమ్మ చెట్టు వద్ద నుంచి మెయిన్‌బజార్ మీదుగా ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మహాలక్ష్మమ్మ వేపమానుకు ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 21: అమరపనాయుడు కండ్రికలో వెలసిన మహాలక్ష్మమ్మ ఆలయంలోని వేపమానుకు పసుపు, కుంకుమ పూలతో సుందరంగా అలంకరించి భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తూర్పు దళితవాడలోని మాతాపరమేశ్వ జాతర సందర్భంగా ఎద్దులబండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఎద్దుల బండ్ల యజమానులు రంగురంగులతో అలంకరించి ఉత్సాహంగా పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామికి రావణసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దువ్వూరు కోటేశ్వరస్వామి శుక్రవారం తెల్లవారుజామున రావణ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రావణుని విగ్రహంపై గంగా పార్వతీ సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి గజమాలలతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వరికుంటపాడు: గువ్వాడి ఎస్సీ కాలనీలోని సీతారామస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టిన వేడుకలో భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు దారిపొడవునా కడవలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే శనివారం వసంతోత్సవం, పారువేట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీల బడిబాట ర్యాలీ

సంగం, జూన్ 21: కొరిమర్లె మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్లు దాటిన పిల్లలను కేంద్రంలో చేర్చాలని ఫ్లెక్సీలతో తల్లులు, చిన్నారులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి ఉన్నారు.

డ్రాప్ అవుట్ విద్యార్థుల గుర్తింపు

అనంతసాగరం, జూన్ 21: ముత్తుకూరు ఎస్టీ కాలనీలో బడికి వెళ్లని ముగ్గురు విద్యార్థినులను శుక్రవారం ఉపాధ్యాయులు గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహించారు. అలాగే బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో కార్యదర్శులు, సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్లు బడిమానేసిన 14ఏళ్లలోపు వయసున్న విద్యార్థుల వివరాలు సేకరించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

వరికుంటపాడు, జూన్ 21: కనియంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్లను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్ విద్యార్థులకు అందజేశారు. మితుకుల వెంకటేశ్వర్లు, కొండెపోగు ప్రసాద్, పవన్‌కుమార్, అన్నమయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

కలువాయి, జూన్ 21: శాసనసభలో ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం కలువాయిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, జగదల్ నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, సుందరయ్య యాదవ్, హరి నాయుడు, గంగవరపు చంద్రమౌళి, తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రామ నారాయణరెడ్డి, కండే శ్రీనివాసులు, నూటేటి నరసింహులు యాదవ్, మాధవ నాయుడు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ కుదుముల సుధాకర్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, ఏపీ యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నం అనిల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తరలివచ్చిన యోగసాధకులతో కలిసి యోగా మాస్టర్లు అనిల్‌కుమార్, పెంచలరెడ్డి యోగాసనాలను సాధన చేయించారు. కార్యక్రమాల్లో ఆత్మకూరు ఉప విద్యా శాఖాధికారి బి.గోపాల్, 20వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, మండల విద్యాధికారి చలపతి, గార్లపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): పాపంపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ ఖాజామొహిద్దీన్ యోగాపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కనసాని అదెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కిరణ్మయి, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి పాల్గొన్నారు.

కలువాయి: ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంచల పుల్లయ్య విద్యార్థులకు యోగా నిర్వహించారు. మాజీ ఎంఈవో -2 శేషగిరిరావు, మాజీ ఎంఈవో బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎంఈవో-2 తోట శ్రీనివాసులు యోగాసనాలు వేయించారు. అనంతరం హెచ్‌ఎం మాలకొండయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆయన్ను సన్మానించారు. అయ్యవారిపల్లి, శకునాలపల్లి, గన్నేపల్లి పాఠశాలల్లో యోగా దినోత్సవం జరుపుకొన్నారు.



కలువాయిలో విద్యార్థుల యోగా..

వింజమూరు: బీజేపీ మండలాధ్యక్షులు డేగ మధుయాదవ్ స్థానిక వేదవ్యాస యోగా శిక్షణ కేంద్రంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పులిచెర్ల వెంకటనారాయణరెడ్డి, విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత సహకారదర్శి కోటేశ్వర రావు, యోగా గురువు నోటి మాల్యాద్రి పాల్గొన్నారు.

సీతారామపురం: ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగా చేశారు.

ఏఎస్ పేట: బీజేపీ మండలాధ్యక్షుడు చెంచులరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో యోగా డేను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, షకీరా, సుశీల, ఆయాలు పాల్గొన్నారు.



ఆత్మకూరు: యోగాలో పాల్గొన్న ప్రముఖులు

ఎమ్మెల్యేగా ఇంటూరి ప్రమాణస్వీకారం

- అభినందనలు తెలిపిన కుటుంబసభ్యులు, ముఖ్యనేతలు

కందుకూరు, జూన్ 21: కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అసెంబ్లీలో సీఎం చంద్రబాబునాయుడు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీశాఖామంత్రి నారా లోకేష్‌లను కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కాగా ఇంటూరి నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, తదితర అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్య టీడీపీ నేతలంతా నాగేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు. ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్‌లు అసెంబ్లీ గ్యాలరీలో కూర్చుని ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. అలాగే ఇంటూరి సన్నిహితులు, టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్దసంఖ్యలో ప్రమాణస్వీకారోత్సవానికి తరలివెళ్లారు.



ఇంటూరితో కుటుంబసభ్యులు, జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, తదితరులు

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కందుకూరు, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామశాస్త్ర విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యోగా ఫర్ సైన్స్ అండ్ సొసైటీ అనే కాన్సెప్ట్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ పాల్గొన్నారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో, కందుకూరు డివిజన్ ఆయుష్ శాఖ వైద్యాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్వాతి, ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్లు పద్మజాకుమారి, లక్ష్మీకుమారి, విమల, రత్నావళి పాల్గొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డిప్యూటీ ఈవో ప్రసాదరావు, ఎంఈవో సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. పట్టణంలోని తిరుమల ఫంక్షన్‌హాలులో గత పదిహేను సంవత్సరాలుగా ఉచిత యోగా శిక్షణనిస్తున్న యోగా శిక్షకులు రాజారావు, కొడాలి శ్రీధర్, కొండయ్యలను యోగాభ్యాసకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : స్థానిక రెడ్‌క్రాస్ యోగా కేంద్రం, రోటరి క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జేబీ డీఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా గురువులు జనార్దన్‌రెడ్డి గురుజీ, సావిత్రి గురుజీలు యోగాసనాలు చేయించారు. గురువులను, అతిధులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ఆర్ శ్రీనివాసులు, అటవీ శాఖ అధికారి ప్రవీణ్, జేబీ ప్రిన్సిపాల్ ఆర్ మాల్యాద్రి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు దినేష్, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, డాక్టర్ మాదవరెడ్డి, స్వర్ణలత, ఇలీంద్ర శ్రీవాణి పాల్గొన్నారు.

- బీజేపీ ఆధ్వర్యంలో పుల్లారెడ్డి నగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో యోగా గురువు జీ సుబ్బరాయుడు యోగా ప్రాముఖ్యతను వివరించి అందరితో ఆసనాలు వేయించారు. నేతలు వీవీ రంగారెడ్డి, బ్రహ్మానందం, సీవీసీ సత్యం, కమల, మాధవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.
- విట్స్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ పర్యవేక్షణలో జేబీ స్టేడియంలో యోగా దినోత్సవం నిర్వహించారు.
- విశ్వోదయ బాలురోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యోగా గురువు రమేష్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్ చౌదరి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఖాదర్ బాషా, ఖాదర్‌బీ, రమేష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.
- శ్రీసాయి విద్యాసంస్థల అధినేత అయ్యలరెడ్డి పర్యవేక్షణలో జూనియర్ కళాశాల, పాఠశాలల్లో యోగా దినోత్సవం జరిగింది.



కందుకూరు : యోగా గురువులను సత్కరిస్తున్న అభ్యాసకులు



కావలిటౌన్ : కల్యాణ మండపంలో ఆసనాలు



ఉలవపాడు : యోగాసనాలు వేస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు



బిట్రగుంట : యోగాసనాలు వేస్తున్న వాకర్స్



కలిగిరి : సిద్ధనకొండూరులో విద్యార్థుల యోగా

ఉలవపాడు : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉలవపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిను యోగాసనాలు వేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వలంటీర్ విశ్వనాథ్, పీడీ కే రమాదేవి, ఉపాధ్యాయులు ఆదిశేషయ్య, సీహెచ్ భాస్కర్, వీవీ సుబ్బారావు, ఆర్ ఫణిరాజు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.స్వర్ణన్ రాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరప్రసాద్, లక్ష్మి, వాకర్స్ నూకసాని శ్రీనివాసులు యాదవ్, ఎఫ్‌ఏ.రాజు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అత్యుత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకరరావు, హెచ్‌ఎం భీమేశ్వరరావు, ఎంఈవో సురేష్, పీఈటీ మురళి, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కో-కన్వీనర్ చల్లా హనుమారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకరరావు, కదిరి వెంకటరంగారావు, వాకా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. సిద్ధనకొండూరులో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారిణి రోహిణి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ ఏ మాల్యాద్రి, హెచ్‌ఎం లక్ష్మీకాంతారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేవీకేలో వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణ

కందుకూరు, జూన్ 21: స్థానిక కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే)లో కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకేలలో పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ), ఉద్యాన సహాయకులు(వీహెచ్ఏ)లకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రసాద్‌బాబు, ఏడీఏ అనసూయల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏవోలు రాము, రవికుమార్, భరత్‌కుమార్, తిరుమలజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు: మాజీ ఎమ్మెల్యే

కావలిటౌన్, జూన్ 21: రౌడీయిజం చేస్తే ప్రజలే బుద్ధి చెబుత్తారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుల్లారెడ్డి నగర్‌లో ఆయన పర్యటించారు. అక్కడ కూల్చేసిన నివాస ప్రాంతాన్ని పరిశీలించి బాధితురాలితో మాట్లాడారు.

తిరుపతిలో రేపు కౌన్సిల్ సమావేశం

కలిగిరి, జూన్ 21: విద్యుత్ శాఖలో ఇప్పటి వరకు జనసేన పార్టీకి అనుబంధ సంఘ లేదని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఆ పార్టీకి అనుబంధంగా ఆవిర్భవిస్తున్న జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 23న తిరుపతిలో నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ కాంట్రాక్టు కార్మికుల సంఘ సభ్యుడు అన్నవరం శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులు హాజరవుతారన్నారు. జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో తిరుపతికి తరలిరావలని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నం కృష్ణ, శేషయ్య, హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ

కావలి, జూన్ 21: నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం కావలి పట్టణం ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని లావణ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబయట విద్యార్థులూ బడిలో చేరేవిధంగా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలు పాల్గొని బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో 8 ఏళ్లు పనిచేసి పదవీ విరమణ చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు జీటీ స్వామిని సన్మానించారు. అనంతరం పాఠశాల పీడీ చంద్రిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడిబాటలో అంగన్‌వాడీ చిన్నారులు

కొండాపురం, జూన్ 21: ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో చేర్చుకునే కార్యక్రమం శుక్రవారం స్థానిక ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో జరిగింది. 5 ఏళ్లు పూర్తయిన 7 మంది చిన్నారులను 1వ తరగతిలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.మాల్యాద్రి చేర్చుకున్నారు. వీరందరికీ ప్రీస్కూల్ ధ్రువపత్రాలను అంగన్‌వాడీ వర్కర్ జి.అంకమ్మ అందచేశారు.



కొండాపురం : సరిఫికెట్లతో చిన్నారులు

బిట్రగుంట : బోగోలు మండలం సీఆర్‌పాలెం పంచాయతీ తాటిచెట్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించారు. ముందుగా సెక్టార్ సూపర్ వైజర్ సుభాషిణి ఆధ్వర్యంలో పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం పిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అంకమ్మ, విజయలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

అల్లూరు, జూన్ 21 : వేసవిలో భూమికి మరింత బలాన్ని చేకూర్చేందుకు అనువైన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. సబ్సిడీ పోను జీలగ కిలో రూ.44, జనుము కిలో రూ.44, పిల్లిపెసర కిలో రూ.67కు పంపిణీ చేస్తారన్నారు.

టీడీపీ నేతల సంబరాలు


కావలి, జూన్ 21: కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేయడంతో కావలిలో టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. తొలిసారిగా క్రిష్ణారెడ్డి అసెంబ్లీలో అడుగు పెట్టడంతో టీడీపీ క్యాడర్, ఆయన అభిమానులు 30వ వార్డులోని గీతా మందిరంలో ఎమ్మెల్యే పేరు మీద పూజలు చేయించి అన్నదానం చేశారు. జామియా మసీద్ ఎదుట రైల్వేరోడ్డులో ముస్లింలు మిఠాయిలు పంచి పెట్టారు. 8వ వార్డు కొత్త బజారులో బాణసంచాకాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్‌గా కొండారెడ్డి

కావలిటౌన్, జూన్ 21: కావలి పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేర్‌టేకర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఇటీవల పీఆర్‌సీఎన్ శిక్షణ పూర్తి చేసుకున్న ఆయనను శుక్రవారం కోటమండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో 10ఏ నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదంగవే, సీఐ అరుణ్‌శర్మలు భుజ కీర్తులు ధరింపచేసి సత్కరించారు. కొండారెడ్డి మాట్లాడుతూ పాఠశాల సహచర ఉపాధ్యాయుల సహకారం, కమాండింగ్ ఆఫీసర్ల ప్రోత్సాహంతో ఎన్‌సీసీకి అంకతభావంతో చేసిన సేవకు గుర్తింపుగా థర్డ్ ఆఫీసర్‌గా గుర్తింపు లభించించడం సంతోషంగా ఉందన్నారు.

బాలుడి అదృశ్యం

కందుకూరు, జూన్ 21: వలేటివారిపాలెం మండలం కళవళ్లకు చెందిన దుగ్గిరాల అభిలాష్(చింటు) అనే 17 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అభిలాష్ రాత్రికి కూడా తిరిగి రాకపోవటంతో చుట్టుపక్కల అన్ని ప్రాంతాలలో గాలించినా ఫలితం లేక శుక్రవారం బాలుడి తల్లిదండ్రులు రాఘవులు, గోవిందమ్మలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దుగ్గిరాల అభిలాష్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిట్రగుంట, జూన్ 21: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ చెన్నారెడ్డిపాలెంకు చెందిన బేల్దారి మేస్త్రీ కొక్కటి శ్రీరాములు (50) గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడి కావలి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దగదర్తి పోలీసులు శుక్రవారం తెలిపారు. లైన్స్‌నగర్ కాలనీ సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త మృతిని భార్య రమణమ్మ కన్నీరు మున్నీరుగా రోదించింది.

యోగాతో శారీరక, మానసికోల్లాసం



వెంకటాచలం : స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యోగా దినోత్సవం నిర్వహిస్తున్న విద్యా మందిర్ పాఠశాల విద్యార్థులు

వెంకటాచలం, జూన్ 21 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇషా ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వీసీ సుందరవల్లి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ స్ఫూర్తితో నిర్వహించినట్లు స్వర్ణభారతి విద్యామందిర్ పాఠశాల పర్యవేక్షకుడు సుబ్బానాయుడు తెలిపారు. కార్యక్రమంలో విద్యామందిర్ ప్రిన్సిపాల్ సులోచన, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

● చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న కమ్యూనిటీ భవనంలో ప్రాచీన తెలుగు విశిష్ఠ అధ్యయన కేంద్రం ఆరోగ్య భారతీ - నెల్లూరు జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగం కావాలని అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జనార్ధన్, డాక్టర్ షామిలి తదితరులున్నారు.

ముత్తుకూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు అన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టులో ఏర్పాటుచేసిన యోగా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యోగా గురువు శివసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోర్టు ఉద్యోగులు యోగ సాధన చేశారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్, సీటీఓ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, ఏజీఎం గంగా సతీష్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: యోగ సాధనతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగా మాస్టారు (బీజేపీ సీనియర్ నేత) కల్లూరు బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో వున్న పతంజలి ధ్యానయోగ ఆనంద నిలయంలో యోగా శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహించారు. అలాగే రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించి ప్రయోజనాలను వివరించారు. ఈకార్యక్రమాలలో బీజేపీ నాయకులు రామిశెట్టి మోహన్‌బాబు, కాసా శ్రీనివాసులు, యోగా సాధకులు, సుధీర్‌కుమార్, విద్యార్థులు, పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీసేవ



ప్రత్యేక అలంకారంలో పార్వతీ పరమేశ్వరులు

మనుబోలు, జూన్ 21: స్థానిక శివాలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పార్వతి, పరమేశ్వరులకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయంలో బ్రహ్మేశ్వరునికి, కామాక్షితాయి మూలవర్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

ఘనంగా కోదండరామస్వామికి పూజలు

విడవలూరు, జూన్ 21: మండల పరిధిలోని ముదివర్తిలోని గిరిజన కాలనీలో ఉన్న ఆలయంలో అభయాంజనేయస్వామి, కోదండరామస్వామికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 16 రోజుల పండుగ



మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 21: మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారికి 16 రోజుల పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీన నిర్వహించిన స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 16రోజుల పండుగ చేశారు. రాత్రి శయన మందిరంలో స్వామి, అమ్మవార్ల ఏకాంత సేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారి గ్రామోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి గిరికృష్ణ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

విద్యార్థినికి నగదు బహుమతి

కోవూరు, జూన్ 21: ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పోట్లూరి సాయిచరితకు శుక్రవారం పూర్వ విద్యార్థి మారంరెడ్డి బలరామిరెడ్డి రూ. 5116 బహూకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వీ రాధారాణి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

తోటపల్లిగూడూరు, జూన్ 21: మండలంలోని కోడూరు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జి శరణ్యప్రియ 982 సాధించడంతో పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ గురుకులంలో చదివే విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన టీడీపీ నేత



పవన్‌కల్యాణ్‌ని కలిసిన బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, జూన్ 21: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్‌ని ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి అసెంబ్లీ చాంబర్‌లో శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కూడా కలిసి సన్మానించారు.

ఊరూరా టీడీపీ నేతల సంబరాలు



సైదాపురంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సైదాపురం, జూన్ 21: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కొండూరు సుబ్రమణ్యం రాజు, సర్పంచు గుంటమడుగు కృష్ణంరాజు, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, వరిగొండ సురేంద్రపాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డి శుక్రవారం శాసనసభలో ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలోని మినగల్లు, నాగాయగుంటలలో టీడీ పీ నాయకులు కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, కే సురేష్‌రెడ్డి, టి సురేష్, కూనంకి కృష్ణయ్య, విరువూరు చెంచయ్య, చందుకుమార్, కోడూరు చెంచయ్య, ఉప్పు నారాయణ, నరసింహ పాల్గొన్నారు.

విడవలూరు : మండల టీడీపీ అధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డిలు కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. అదేవిధంగా రామ్‌నగర్‌కు చెందిన మాలమహానాడు రాష్ట్ర నాయకురాలు పల్లం శేషమ్మ ఆధ్వర్యంలో తెలుగు మహిళా కార్యకర్తలు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. పార్లపల్లిలో టీడీపీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వర్లు, తాత బాలకృష్ణల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఊటుకూరులో కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

రాపూరు(డక్కిలి) : కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి ఎమ్మెల్యేగా శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని పాత బస్టాండు సెంటరులో నాయకులు చెన్ను తిరుపాలరెడ్డి, దండవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, ఏదోటి కోటేశ్వరనాయుడులతో కలిసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఖాజామొహిద్దీన్, గౌస్‌బాషా, లతీఫ్, సోనీ, పాపయ్య, మహేష్, రమణమ్మ పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో గోడలు కూల్చివేత



నేలమట్టమైన గోడలు

కోవూరు, జూన్ 21: కావలి-నెల్లూరు జాతీయ రహదారి పక్కన ఆర్టీసీ రీట్రేడింగ్‌కు వెళ్ళే మార్గంలోని ఫ్లైఓవర్ సమీపంలో వివాదాస్పద స్థలంలో గత ప్రభుత్వ హయాంలో ఓ వైసీపీ నాయకుడు నిర్మించిన గోడల్ని గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చినట్లు తెలిసింది. జాతీయ రహదారి పక్కనున్న స్థలం విషయమై సివిల్ కోర్టులో వాజ్యం నడుస్తుండగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే కొద్దిరోజుల ముందు వైసీపీ నాయకుడు గోడలు కట్టి స్థలాన్ని ఆక్రమించాడు. కాగా, ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఆ నాయకునికి వ్యతిరేకమైన గుర్తు తెలియని వ్యక్తులు గోడల్ని కూల్చివేసినట్లు తెలిసింది. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పొదలకూరు, జూన్ 21: పట్టణంలోని బిట్-3 రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు చేతుల మీదుగా రైతులకు విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏఓ గీతాకుమారి, ఏఈవో ఏడుకొండలు, వీఏఏ గోవర్ధన్, దీప్తి, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ భవనం స్వాధీనం చేసుకోవాలి

మనుబోలు, జూన్ 21: స్థానిక పశువైద్యశాల వద్ద ప్రభుత్వ స్థలంలో వాటర్‌ప్లాంట్ భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంటూ మనుబోలు టీడీపీ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం వాటర్‌ప్లాంట్ కోసం, వైద్యసిబ్బంది కోసం కేటాయించిన స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిందన్నారు. అయితే అందులో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, స్థలం మాత్రం ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉందన్నారు. కావున భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలికి రమేష్ రెడ్డి, రావుల అంకయ్య గౌడ్, రాయపాటి కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

శ్యామ్ సుందర్ భగవాన్‌కు డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం, జూన్ 21 : స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆంగ్ల విభాగం పరిశోధన విద్యార్థి బోడావుల శ్యామ్ సుందర్ భగవాన్‌కు శుక్రవారం వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. సుందర్ భగవాన్ ది సెలెక్ట్ వర్క్స్ ఆఫ్ ఆర్డబ్ల్యూ ఎమర్సన్ అండ్ అద్వైత వేదాంత ఏ క్రిటికల్ అండ్ కంపారిటివ్ స్టడీ అను అంశంపై ఆంగ్ల శాఖ అధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ ప్రభాకర్ పర్యవేక్షణలో పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. ఈపరిశోధన వ్యాసానికి గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని శ్యామ్ సుందర్ భగవాన్‌కు వీసీ సుందరవల్లి డాక్టరేట్ ప్రదానం చేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



బుచ్చిరెడ్డిపాళెంలో విద్యార్థుల మానవహారం

తోటపల్లిగూడూరు, జూన్ 21: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని బాల కార్మికులను, బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంపై విద్యాశాఖ, జిల్లా కార్మిక శాఖ, ఎన్జీవో అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఎస్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే నేను బడికిపోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ మన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ షేక్ గౌస్, ఎంఈవో-2 జయరామనాయుడు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లు రామారావు, శ్రీనివాసు నాయుడు, అనీల్, చైతన్య జ్యోతి, ఎన్జీవో ఆర్గనైజేషన్ సెక్రటరీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఖాదర్‌బాష, సీఆర్పీలు, పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని బడికిపోతా కమిటీ చైర్మన్, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, తహసీల్దారు సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు విద్యార్థులు, బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల నుంచి రిజిస్ట్రార్ ఆఫీస్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో మానవహారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన విద్య, తదితర అంశాలపై ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి పిల్లల తలిదండ్రులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీ ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విడవలూరు : మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలో చిన్నారులకు అందజేస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణకుమారి, పద్మ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

యోగాతో ఆరోగ్యం

● ఘనంగా యోగా దినోత్సవం



రామచంద్ర మిషన్‌లో...



రత్నం విద్యాసంస్థల్లో...



డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

నెల్లూరు (విద్య), జూన్ 21 : యోగా సాధన ద్వారా శరీరంలోని జీవక్రియలను నియంత్ర ణలో ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని యోగా గురువులు పేర్కొన్నారు. ప్రపంచ 10వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్, యోగా మిత్ర మండలి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా నగరంలోని శ్రీ రామచంద్ర మిషన్ ఆవరణలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకటకృష్ణ మాట్లాడుతూ క్షణం తీరికలేని నేటి జీవన విధానంలో మనిషి ఎన్నో రుగ్మతలకు గురవుతున్నాడన్నారు. వీటిని అధిగమించేందుకు భారతీయులకు వారసత్వ సంపదైన యోగాను సాధన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, క్రీడాకారులు, అభ్యాసకులు చేసిన ధ్యానం, యోగాసనాలు, పిరమిడ్ సాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆయుష్ విభాగం జిల్లాధికారి డాక్టర్ గోవిందయ్య, డీఎస్‌డీవో యతిరాజ్, యోగా మిత్రమండలి కార్యదర్శి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే, నగరంలోని పలు ప్రాంతాల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో...



డీఎంహెచ్‌వో కార్యాలయంలో

నెల్లూరు (వైద్యం) : నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. అధికారులు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలీ, వైద్యా ధికారులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా సనాలు వేస్తే ఆరోగ్యం సమకూరుతుందని చెప్పారు.

● మెడికవర్ ఆసుపత్రిలో యోగా నిపుణులు ప్రసన్నకుమార్, స్వప్న కలిసి వైద్యులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కేన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందురెడ్డి మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతతకు యోగాసనాలు ఎంతో ఉపయోగ పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో యోగా దినోత్సవం జరిగింది. రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, ఉమామహేశ్వరి, వాసు, దివ్యాంగుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● యోగా మిత్రమండలి, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం, నెహ్రూ యువకేంద్రం, పీఎంపీ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌ఐవో, డీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు అందరూ నిత్యం యోగా సాధన చేయాలన్నారు. అనంతరం ఇథాకా స్కూల్ చిన్నారులు చేసిన యోగాసనాలు, పిరమిడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, యోగామిత్ర మండలి సభ్యులు విజయకుమార్‌రెడ్డి, రవీంద్ర, యోగ శిక్షకులు పద్మావతి, నాగూర్ గురుజీ, పీహెచ్‌సీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

● డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వ ర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లా డుతూ విద్యార్థినులంతా యోగా ప్రాముఖ్యతను గుర్తించి నిత్యం సాధన చేసి ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందాలని సూచించారు. ఈ ఏడాది నుంచి కళా శాలలో నిత్యం యోగా తరగతులు నిర్వహిం చేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనంతరం యోగా గురువు అరుణ విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పీడీ డాక్టర్ సీ విజయకళ, అధ్యాపకులు, ఎన్‌ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

● దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఈవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ యోగా సాధనతో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. హార్మోన్ల సమస్యలు, స్త్రీల రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, ఏఎంవో సుధీర్‌బాబు, సీఎంవో పెంచలయ్య, ఎంఈవో మురళీధర్, ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణారెడ్డి, పీఈటీలు ఏ విజయ్‌కుమార్, ఎం శ్రీనివాసులు, కే పార్వతి పాల్గొన్నారు.

● యోగాలో విశ్వశక్తిగా భారత్ కీర్తిగడిస్తోందని ప్రభుత్వ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్ తెలిపారు. సంతపేటలోని ఆ కళాశాలలో జరిగిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత్‌లో పుట్టిన యోగా నేడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. ఈ సంద ర్భంగా ప్రణవ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా మాస్టర్ వీ చంద్రశేఖర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించా రు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● స్టోన్‌హౌస్‌పేట ఆర్‌ఎస్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన యోగా దినోత్సవంలో హెచ్‌ఎం మధుసూదన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం యోగా సాధన చేసి విద్యలో ఉత్తమంగా రాణించాలని సూచించారు. అనంతరం 24వ ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన యోగా విన్యాసాలు అంద రినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేనేజర్ రాజేష్‌కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ మో హన్‌రెడ్డి, మురికిపూడి ట్రస్ట్ అధ్యక్షుడు సతీష్ కుమార్, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ బాల బ్రహ్మచారి, ఎన్‌సీసీ సిబ్బంది ప్రసాద్, శ్యామ్ కుమార్, జావిద్, ప్రదీప్, సుజన, సిబ్బంది పాల్గొన్నారు.



జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న అధికారులు

● మూలాపేటలోని నగరపాలక పాఠశాల (రామయ్యబడి)లో హెచ్‌ఎం వేదమూర్తి మాట్లా డుతూ నేటి ఆధునిక జీవనంలో ఎదురయ్యే సమస్యలు, ఒత్తిళ్లను అధిగమించాలంటే నిత్యం యోగా సాధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో యోగా, ధ్యానం చేయించారు. ఉపాధ్యాయులు కమతం సుబ్బారావు, రియాజ్ అహ్మద్, కిన్నెర మల్లికార్జున పాల్గొన్నారు.

● చిల్డ్రన్స్‌పార్కు రోడ్డులోని సాయి మిలీనియం పాఠశాలలో కరస్పాండెంట్ రామిరెడ్డి రజిత మాట్లాడుతూ తనువు, మనసు, ఆత్మను ఏకం చేసి చేసే సాధనే యోగా అని తెలిపారు. యోగా శిక్షకురాలు వీ లక్ష్మీదేవి విద్యార్థులతో యోగాసనాలు చేయించారు.

● డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. గురువులు విద్యార్థులతో యోగాభ్యాసం చేయించి పలు సూచనలు చేశారు. జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, జూని యర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణి మాల, ప్రపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● **నెల్లూరు రూరల్ :** ఎలాంటి వ్యాధినైనా యోగాతో నయం చేయవచ్చని బుజబుజ నెల్లూరుకు చెందిన టీడీపీ కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి అన్నారు. స్థానిక శేషు స్కూల్లో జరిగిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నరసింహగిరితోపాటు స్కూల్ కరస్పాండెంట్ బీ శేషు యాదవ్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యోగా గురువు పెంచలయ్య పాల్గొన్నారు. కాగా, కనుపర్తిపాడులోని ఇథాకా స్కూల్లో కూడా యోగా దినోత్సవం నిర్వహించారు.

పోలీసు పరేడ్ మైదానంలో...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పోలీస్ పెరేడ్ మైదానంలో సామూహిక యోగా సనాల కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ జీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగా అనేది భారతీయ వారసత్వ సంస్కృతిలో భాగమన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన విలువైన బహుమతుల్లో యోగా ఒకటన్నారు. దీనిని ప్రతి ఒక్కరు జీవితంలో భాగం చేసుకుని భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

● బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భైరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఎస్‌ఆర్ పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు సునోలా పర్యవేక్షణలో విద్యార్థులకు యోగా అభ్యాసన, అవగాహన కల్పించారు. నాయకులు కిషోర్, సరాబు లక్ష్మణ్, దగ్గుబాటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● సంతపేటలోని ప్రభుత్వ మోడల్‌హైస్కూల్ మైదానంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, పతాంజలి జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌ఆర్‌ఎం స్కూలు మైదానంలో యోగా విన్యాసం

బాలయ్యకు కోటంరెడ్డి శుభాకాంక్షలు



బాలకృష్ణతో కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం) జూన్ 21 : ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కలిశారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా శుక్రవారం తాడేపల్లిలో బాలయ్యను కలిసి శుభాకాంక్షలు తెలియ చేశారు. యువతకు బాలకృష్ణ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జెడ్పీ), జూన్ 21: నగరంలోని డైకాస్‌రోడ్డు సబ్‌స్టేషన్, ఎంజీనగర్ సబ్‌స్టేషన్, బీవీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ సోమశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలంకార్‌సెంటర్, బ్రాహ్మణవీధి, రాజాగారివీధి, బ్రహ్మానందపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డి నగర్, డీఈవో ఆఫీసు, సప్తగిరి లేవుట్, జనశక్తి నగర్, కొండాయపాళెం, పాత వేదాయపాళెం, కావేరినగర్, భవానీ స్కై టవర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

జన సైనికుల సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 21: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సంబరాలు చేశారు. నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 220 టెంకాయలు సమర్పించారు. పార్టీ నాయకుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో ఆమని గార్డెన్స్ వద్ద భారీ కేక్‌ను కట్ చేసి బాణాసంచా కాల్చారు. జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. పవన్ కల్యాణ్‌తోనే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు.

రూరల్ ఎమ్మెల్యేకు బాధితుల కృతజ్ఞతలు


నెల్లూరు రూరల్, జూన్ 20 : తాము వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన స్థలాలను వైసీపీ నాయకులు ఆక్రమించుకోగా వారి నుంచి విముక్తి కల్పించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు దేవరపాళెం భూ బాధితులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న స్థలాల్లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. పంచేటి భరత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



















అసెంబ్లీలో వేడుకగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అలుపెరగక పోరాడి చిరస్మరణీయ విజయం సాధించిన 17మంది ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు.కుప్పం నుంచీ వరుసగా ఎనిమిదవ సారి అద్భుత విజయం సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారంతో కార్యక్రమం ప్రారంభమైంది.చిత్తూరు జిల్లాలో పలమనేరు నుంచి అమరనాథరెడ్డి,నగరి నుంచి గాలి భానుప్రకాష్,చిత్తూరు నుంచి గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్,పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లాలో పీలేరు నుంచి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, మదనపల్లె నుంచి షాజహాన్ బాషా, తంబళ్లపల్లె నుంచి ద్వారకనాథ రెడ్డి, తిరుపతి జిల్లాలో చంద్రగిరి నుంచీ పులివర్తి వెంకటమణిప్రసాద్ అలియాస్ నాని,తిరుపతి నుంచి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి,వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.వీరిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఓం నమోవెంకటేశాయ...అంటూ మొదలుపెట్టి దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేయగా పెద్దిరెడ్డి ఆంగ్లంలో ప్రమాణం చేశారు.



యోగా...మంచిదేగా

యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా యోగాసనాల సందడి కన్పించింది. యోగాపై ఆసక్తి వున్న చిన్నా పెద్దా మొదలుకుని కార్యాలయాల్లో అధికారులు,సిబ్బంది, పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు.ఒత్తిడితో విధులు నిర్వర్తించే వారికి యోగాతో ఉపశమనం లభిస్తుందని యోగా అభ్యాసకులు సూచించారు.



బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

తిరుపతిలో పనిచేయడం ఎప్పటికీ మరువలేను

- కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ -

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 21: 'తిరుపతి కలెక్టర్‌గా పనిచేయడం ఎప్పటికీ మరువలేను. ఇక్కడి నుంచే పదోన్నతిపై వెళ్లడం సంతోషంగా ఉంది' అని బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. భూగర్భశాఖ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న ఆయన్ను ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. బీఎల్వో నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందించిన సహకారంతోనే సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, మీడియా సహకారం మరువలేనిదన్నారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. ఎక్కడా విమర్శలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఎస్డీసీలు చంద్రశేఖర్‌నాయుడు, మురళి, కోదండరామిరెడ్డి, జిల్లా అధికారులు ప్రసాదరావు, ప్రేమచంద్రారెడ్డి, చంద్రశేకర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్ బాధ్యతల స్వీకారం

ప్రవీణ్‌కుమార్ విధులనుంచి రిలీవ్ అయ్యారు. దాంతో జేసీ ధ్యానచంద్ర.. ఇన్‌చార్జి కలెక్టర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కలెక్టరేట్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి నియంత్రణకు

యాక్షన్ ప్లాన్

యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు

విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21 : తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో గంజాయి వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ సిద్ధమైంది.జిల్లాలో గంజాయి విక్రయాలకు అడ్డాగా మారిన దాదాపు 49 ప్రాంతాలను గుర్తించిన పోలీసు యంత్రాంగం 100 రోజుల్లో గంజాయి వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తోంది.ఈ ప్రాంతాల్లో నిరంతరం నిఘా వుండేలా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రత్యేక యాక్షన్ టీమ్‌లు ఏర్పాటు చేయనున్నారు.యువకులు, విద్యార్థులు గంజాయికి అలవాటుపడకుండా ఉండేందుకు ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తూ యాంటీ డ్రగ్ కమిటీలను నియమించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు నిర్ణయించారు. గంజాయి, మత్తు మందుల వినియోగం వల్ల తలెత్తే సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులతో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు.ఆయా కమిటీలు గంజాయి వినియోగిస్తున్న యువకులను, విద్యార్థులను గుర్తించి పోలీసులకు సమాచారం అందిస్తే వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించనున్నారు.



ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు :ఎస్పీ

తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో గంజాయి రవాణాతో పాటు వినియోగం, విక్రయాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు.జిల్లాలోకి గంజాయి రాకుండా వుండడానికి అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు.సీఐ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, 10 మంది ఎస్‌టీఎఫ్ బలగాలు, సెబ్ సిబ్బంది, స్థానిక పోలీసులతో కలిపి 20 మందిని టాస్క్‌ఫోర్సు కమిటీలో నియమిస్తున్నామన్నారు.

ఉద్యోగంలో చేరేందుకు వెళ్తూ....

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాద దృశ్యం

తడ, జూన్ 21: ఆ యువకుడికి అపాచీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.తొలిరోజు విధుల్లో చేరేందుకు ఆనందంగా వెళ్తున్న ఆ యువకుడిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కాటేసింది.పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం నెల్లిపూడికి చెందిన బి.వంశీకి (28) తడ మండలం మాంబట్టు పారిశ్రామిక వాడలోని అపాచీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.ఉద్యోగంలో చేరేందుకు శుక్రవారం ఉదయం వాకాడు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో తడ మండలం కాదులూరు సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో మరో మోటరు సైకిల్‌ను ఢీకొని అదుపుతప్పడంతో బస్సుకింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో దాదాపు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది.



వంశీ (ఫైల్ ఫొటో)

పీఎస్-4 హోటల్ సీజ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 21 : తిరుపతిలోని లీలామహల్ సర్కిల్ సమీపంలో ఉన్న పీఎస్-4 హోటల్‌ను కార్పొరేషన్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గురువారం మధ్యాహ్నం హోటల్‌లో భోంచేస్తుండగా పుత్తూరు యువకుడికి చపాతి, బీట్‌రూట్ కర్రీలో జెర్రి కనిపించింది. ఆయన ఫిర్యాదుతో మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగ అధికారులు హోటల్‌ను తనిఖీ చేశారు.కిచెన్‌లో కూరగాయలు, ఇతర పదార్థాలు నిల్వ ఉంచడానికి అనువైన వాతావరణం లేదని గుర్తించారు. కుళ్లిన కూరగాయలు, ఆహార పదార్థాలను కూడా అక్కడ గమనించి సిబ్బందిని నిలదీసి తాత్కాలికంగా కిచెన్‌ను సీజ్ చేశారు. అయితే మళ్ళీ హోటల్ యధావిధిగా నడుస్తుండడంతో శుక్రవారం సీపీఎం నాయకులు హోటల్ ఎదురుగా ఆందోళన చేపట్టి హోటల్‌ను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో దిగి వచ్చిన కార్పొరేషన్ హెల్త్ అధికారులు హుటాహుటిన హోటల్‌ను సీజ్ చేసినట్లు నోటీసు అతికించారు. దీంతో శుక్రవారం నుంచి హోటల్ మూతపడింది.



కిచెన్‌లో పాడైపోయిన పనసకాయలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఆరోగ్యవిభాగ సిబ్బంది

నాణ్యమైన నెయ్యితో శాంపిల్ లడ్డూలు తయారు చేయండి



పోటు కార్మికులకు సూచనలిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన నెయ్యి, శెనగపిండి, యాలకులతో శాంపిల్ లడ్డూలు తయారు చేయాలని పోటు కార్మికులను టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. శ్రీవారి లడ్డూల నాణ్యత తగ్గిందంటూ భక్తుల నుంచి వరుసగా ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. అయితే దిట్టం ప్రకారమే లడ్డూలను తయారు చేస్తున్నామని, తమ పూర్వీకుల విధానాలనే పాటిస్తున్నామంటూ పోటు కార్మికులు కూడా మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన సందర్భాలున్నాయి. టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు ప్రతి విభాగంపై ప్రత్యేక దృష్టిసారించి.. సంబంధిత విభాగాలతో సమీక్షిస్తున్నారు. లోటుపాట్లను గుర్తించి పలు సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తిరుమలలోని గోకులంలో శుక్రవారం లడ్డూల తయారీపై జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్‌తో కలిసి సమీక్షించారు. లడ్డూల తయారీలోని సమస్యలు, నాణ్యతపై వస్తున్న విమర్శలకు గల కారణాలను పోటు కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పోటు కార్మికులు లడ్డూల తయారీకి వినియోగిస్తున్న శెనగపిండి, నెయ్యి, యాలకులను ఈవోకు చూపారు. పనిభారం పెరిగిపోతోందని, అదనపు సిబ్బందిని నియమించాలని విన్నవించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పోటు ఏఈవో శ్రీనివాసులు, విశ్రాంత ఏఈవోలు శ్రీనివాసన్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించి న్యాయం చేయండి


నిరసనలో ఉడతావారిపార్లపల్లి రైతులు

చిల్లకూరు, జూన్ 21: సాగరమాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు పరిహారం అందించాలని మండలం లోని ఉడతా వారిపార్లపల్లికి చెందిన రైతులు శుక్రవారం వారి భూముల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 60 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న తమ భూములకు ఏలాంటి పరిహారం ఇవ్వకుండా రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు సుమారు 18 ఎకరాల భూమి చెరువు పొరంబోకు కింద ఉందని, పట్టాలున్నా చెల్లవని పరిహారం ఇవ్వకుండా తమను మోసం చేశాన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించిన తమకు పరిహారం కానీ, పొలం కానీ ఇవ్వాలని కోరారు.

నీట్‌ను రద్దు చేయాలి


కాంగ్రెస్ నాయకుల నిరసన

గూడూరు అర్బన్, జూన్ 21: ఇటీవల జరిగిన నీట్‌లో పలు అవకతవకలు వెలుగు చూశాయని దాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీట్ అవకతవకలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటి వరకు ఈ విషయమై బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ ధర్నాలో వేమయ్య, చంద్రశేఖర్, సుబ్బరామరాజు, శ్రీనివాసాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్‌సుల్తానాబేగం

గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న జాతీ య లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకో వాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులను కక్షిదారులు లోక్అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. దీంతో సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనా రాణి, లోకనాథం, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు, పార్వతయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా చిరంజీవి



గూడూరు అర్బన్, జూన్ 21: విజయవాడలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఫ్యాప్టో సెక్రటరీ జనరల్‌గా గూడూరుకు చెందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. దీంతో డివిజన్ ఏపీటీఎఫ్ నాయకుడు శివరామిరెడ్డి, రమణయ్య, బాబు, శివ, జైపాల్, భాస్కర్‌రెడ్డి, మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

వేలం వాయిదా

కోట, జూన్ 21 : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీ జరగాల్సిన చెట్ల వేలం వాయిదా వేసినట్లు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వేలంను జూలై 6వ తేదీకి వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. అదే రోజు ఉదయం 10.30గంటలకు కోర్టు ప్రాంగణంలో వేలం నిర్వహిస్తారని జడ్జి తెలిపారు.

ఏపీ హంస కార్యవర్గం

నాయుడుపేట/కోట, జూన్ 21: నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్స్ అసోసియేషన్ నాయుడుపేట తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. నాయుడుపేట తాలూకా అధ్యక్షుడిగా కె.వెంకటగోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, సెక్రటరీగా ఆకుల సుభాషిణి, కోశాధికారిగా బల్లి ప్రభాకర్, మహిళా విభాగ కార్యదర్శిగా సంపూర్ణమ్మ తదితరులను ఎన్నుకున్నారు. కోట పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏపీ హంస ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. వాకాడు తాలూకా అధ్యక్షుడిగా కె.నాగయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రవి, కార్యదర్శిగా పి. లక్ష్మీపతి, కోశాధికారిగా విజయభారతి తదితరులు ఎన్నికయ్యారు.

శ్రేష్టలో మండల విద్యార్థిని ప్రతిభ


నేత్విక

పెళ్లకూరు, జూన్ 21: స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హై స్కూల్ (శ్రేష్ట) ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండలంలోని తాళ్వాయిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వి.నేత్విక జాతీయ స్థాయిలో 351వ ర్యాంకు సాధించింది. దీంతో ఇంటర్ మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఇంటర్నేషనల్ స్కూల్లో ఉచితంగా విద్యను అభ్యసించేందుకు అర్హత పొందింది.

మట్టి నమూనాల సేకరణ


మట్టి నమూనాల సేకరనలో అధికారులు

సూళ్లూరుపేట, జూన్ 21: మండల పరిధిలోని కోటపోలూరులో శుక్రవారం వ్యవసాయాధికారులు రైతుల సాగు చేసే భూ ముల్లో మట్టి నమూనాలను సేకరించారు. వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. మెలకవలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్ర మంలో ఏవో కవిత, గ్రామ సహాకులు హిమబిందు, చిరంజీవి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడ సేవ



గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక రాజా వీధిలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని మోహినీ అలంకారంలో పల్లకిపై అధిష్ఠింపజేసి ఊరేగిం చారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంక రించి ఆయనకు ఇష్టమైన గరుడవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, జూన్ 21: స్థానిక తాళమ్మగుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘ టనా స్థలానికి చేరుకున్న పోలీ సులు మృతదేహాన్ని పరిశీలిం చారు. 55ఏళ్ల వయస్సు ఉండవ చ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ చెప్పారు.

పోస్టింగుల కోసం పోటీ

- నాయకుల చుట్టూ అధికారుల ప్రదక్షిణ ● కోరుకున్న చోట ఆరాటం
- గత టీడీపీ ప్రభుత్వంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారుల యత్నం

తడ, జూన్ 21: ఎన్నికలు అయిపోయాయి... ప్రజల్లో హడావుడి పక్కకెళ్లింది. ఇప్పుడు అధికారుల హడావుడి మొదలైంది. రోజూ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎందుకంటరా... ప్రభుత్వం మారిందిగా... తాము కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం. అందులోనూ గతంలో అవినీతి ఆరోపణలతో దూరమైన ఉద్యోగానికి మళ్లీ అదేస్థానంలో కొందరు అవినీతి అధికారులు పోస్టింగ్‌ల కోసం పోటీ పడుతుండటం విశేషం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మండల స్థాయి అధికారులందరినీ బదిలీ చేసింది. పక్కజిల్లాల అధికారులు కొలువుదీరి ఎన్నికల రంగాన్ని సమర్థవంతంగా నడిపించారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయి ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఉద్యోగులు అలెర్ట్ అయ్యారు. వారికి తాము కోరుకున్నచోట పోస్టింగ్ కోసం ఆరాటపడుతున్నారు. నిన్నటి వరకు గుర్తుకురాని నాయకుల ఇళ్లను నేడు వెతుక్కొని వెళ్లి మరీ తమకు అనుకూలమైన చోట పోస్టింగ్ ఇప్పించాలంటూ అభ్యర్థిస్తున్నారు. అందుకు తాము అనుకూలంగా వ్యవహరిస్తామంటూ వెల్లడిస్తున్నారు. ఫలనా అధికారికి ఫలనా నాయకుడు హామీ ఇచ్చాడుకదా... బహుశా ఆయనకే అక్కడ పోస్టింగ్ వచ్చేలా ఉందని మాటలు వినబడుతున్నాయి. అయితే కొందరు అధికారుల విషయంలో విస్మయం వ్యక్తమవుతోంది. గతంలో అవినీతి ఆరోపణలే దీనికి కారణం. వారు మళ్లీ ఇక్కడ అధికారిగా వస్తే అవినీతికి అంతు ఉండదని మాట్లాడుకోవడం కన్పిస్తోంది. ఈ మాటలు ముఖ్యంగా పోలీసు శాఖపైనే ఎక్కువగా సాగుతున్నాయి. ముఖ్యంగా 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసిన ఒకరిద్దరు అధికారులపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాలో సదరు అధికారుల ప్రత్యక్ష సహకారం ఉండటమే కారణం. దీంతో అప్పట్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో 2016లో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా పోలీస్ బాసుగా పీహెచ్‌డీ రామకృష్ణను నియమించి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించినవెంటనే సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలోని అవినీతిపై విచారణ జరిపించారు. అధికారుల ప్రత్యక్షపాత్రపై నిర్ధారణకు వచ్చి వారిపై చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి లూప్‌లైన్‌లో ఉన్న సదరు అధికారులు టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ నాయకుల ముందు ప్రత్యక్షమైపోయారు. తమకు జాతీయ రహదారుల వెంబడి ఉండే పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్ ఇప్పించాలంటూ వేడుకుంటున్నారు. వీరికి గత టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలలో చక్రం తిప్పిన కొందరు స్మగ్లర్లు తోడై వారికి పోస్టింగ్ ఇప్పించేందుకు తమ వంతుసాయం చేస్తున్నట్లు గుసగుసలు ఉన్నాయి. అయితే 2016లో ఈ అధికారులు పాల్పడ్డ అవినీతిని ప్రస్తుత నాయకులు గుర్తు లేదోమో కానీ ప్రజలు మరచిపోలేదు. దాంతో ఈ అధి కారులు ఈ ప్రాంతంలో పోస్టింగ్ వస్తే అవినీతికి ద్వారాలు తెరచినట్లేనని మాట్లాడుకుంటున్నారు. ఏదీ ఏమైనా ప్రభుత్వం మారడంతో అధికారుల పోస్టింగ్‌లో పోటీ తీవ్రంగా నెలకొని ఉంది. అవినీతి అధికారులను దూరంగా ఉంచితే మంచిదంటూ జనం మాట్లాడుకుంటున్నారు.

ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం... టీడీపీ నాయకుల సంబరం


గూడూరు, బాలాయపల్లి, డక్కిలిలో టీడీపీ నాయకుల సంబరాలు

గూడూరు, జూన్ 21: పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద టీడీపీ మాజీ కౌన్సిలర్ వి.శివకుమార్ ఆధ్వర్యంలో భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి పాశిం సునీల్‌కుమార్ ప్రమాణస్వీకారం చేస్తుండగా వీక్షిస్తూ, బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, వి.హరి, జి.లీలావతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరులో మట్టం శ్రావణి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

డక్కిలి: కురుగొండ్ల ప్రమాణ స్వీకారం సందర్భంగా డక్కిలిలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్య నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. డి.చంద్రారెడ్డి, డి.పెంచలరెడ్డి, వి.నాగభూణం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు పులికొల్లు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, తిరుపతి పార్లమెంటు పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు పి. విశ్వనాథనాయుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి పంచి పెట్టారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యంనాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, కె.రామచంద్రనాయుడు, టి.ప్రసాద్ నాయుడు, దాసరి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరి టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు

పెళ్లకూరు: ఎమ్మెల్యే విజయశ్రీ ప్రమాణస్వీకారం సందర్భంగా పెళ్లకూరు మండలం నుంచి అమరావతికి తరలి వెళ్లిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వి.శేఖర్ నాయుడు, డి.ప్రసాద్‌నాయుడు, హరినాయుడు, ఎస్.ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యానాయుడు, యుగంధర్, నరేంద్రయాదవ్ తదితరులున్నారు.

కోటలో టీడీపీ నేతల సంబరాలు


క్రాస్‌రోడ్డులో సుష్మారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు - బజారు సెంటర్‌లో టీడీపీ నాయకుల సంబరాలు

కోట, జూన్ 21: కోట పట్టణం, కోట క్రాస్‌రోడ్డులో శుక్రవారం టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన పాశిం సునీల్‌కుమార్‌కు మద్దతుగా కోట గోపాల్‌రెడ్డి విగ్రహం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా క్రాస్‌రోడ్డులో తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.సుష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పాశిం సునీల్‌కుమార్ నాయకత్వంలో మరీంత అభివృద్ధి జరగాలని నినాదాలు చేశారు. మర్రి అనిల్, నరేంద్రరెడ్డి, పోలయ్య, రాధాక్రిష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గూడలిలో వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, చెందోడులో పార్టీ జిల్లా కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

యోగాతో ఒత్తిడి దూరం


షార్‌లో యోగాసనాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు

సూళ్లూరుపేట, జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగాసానాలు వేశారు.

గూడూరు: ఒత్తిడిని అధిగమించేందుకు యోగా దోహదపడుతుందని బీజేపీ జాతీయ కార్యదర్శి రాష్ట్ర బీజేపీ సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో హాలండ్‌కు చెందిన మహర్షి వేదిక్ యూనివర్సిటీ, ఆదిశంకర విద్యాసంస్థల ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యోగా ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేలా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేశారన్నారు. యోగాతో ఏకాగ్రతను పెంచుకుని చదువులో లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ మోహన్, శేఖర్‌రెడ్డి, రామయ్య, యోగా గురువు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఏఆర్‌డి ప్రభుత్వ స్టేడియంలో, ప్రగతి సేవాసంస్థల ఆధ్వర్యంలో, నారాయణ జూనియర్ కళాశాలలో దినోత్సవాన్ని నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీఈటీ మహేష్, ఉపాధ్యాయుడు సుంకర రవి అన్నారు. శుక్రవారం పలు పాఠశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు.

బాలాయపల్లి: పంచాయతీలోని చుట్టి గ్రామంలో జరుగుతున్న అమృత సరోవర్ పనుల వద్ద ఉపాధి కూలీలు యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయరావు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఎంఈవో మునిరత్నం ఆధ్వర్యంలో జరిగింది. యోగా మాస్టర్లు పద్మనాభం, సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను ఎన్‌సీసీ కేడెట్లు యోగా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

చిల్లకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ మీరాసాహెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు యోగాసనాలు వేశారు.


చుట్టి గ్రామంలో ఉపాధి కూలీల యోగా , ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో , గూడూరులో యోగాసనాల్లో విద్యార్థులు

ఎమ్మెల్యేగా కురుగొండ్ల ప్రమాణ స్వీకారం


ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యతో కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 21 : తమ అభిమాన నాయకుడు కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి ఎమ్మెల్యేగా శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు టీవీల ద్వారా వీక్షించారు. రామకృష్ణ ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్‌కి పాదాభివందనం చేశారు.

విజయశ్రీ ప్రమాణస్వీకారం


ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యతో విజయశ్రీ

తడ, జూన్ 21: సూళ్లూరు పేట శాసనసభ్యురాలిగా డాక్టర్ నెలవల విజయశ్రీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని శాసన సభ లో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో విజయశ్రీ ప్రమాణం చేశా రు. సార్వత్రిక ఎన్నికల్లో సూ ళ్లూరుపేట ఎమ్మెల్యేగా గెలు పొందిన ఆమె తొలి మహిళా ఎమ్మెల్యే కావడం విశేషం. ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ వద్దకు వెళ్లి అభివాదం చేసి అక్కడ నుంచి ఆమె నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌కు నమస్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. నెలవల విజయశ్రీ ప్రమాణస్వీకారం సందర్భంగా నియోజకవర్గం నుంచి నాయకులు పెద్ద ఎత్తున అమరావతికి తరలివెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే విజయశ్రీని అభినందనలతో ముంచెత్తారు. ఎమ్మెల్యేను కలుసుకున్నవారిలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, నాయకులు బి.పళణి, శ్రీధర్, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, విజయకుమార్‌నాయుడు, నాగేంద్రరెడ్డి, ఆకుతోట రమేష్, చైతన్య కృష్ణారెడ్డి, లోకేష్, రఫీ, సుదర్శన్, ఏకాంబరం, జయపాల్ తదితరులు ఉన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి



గూడూరు, జూన్ 21: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు అభివాదం చేశారు.

సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన గణపర్తి



చిట్టమూరు, జూన్ 21: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును చిట్టమూరు టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలసి శుభా కాంక్షలు తెలియజేశారు. అమరావతిలో ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయనతో పాటు మండల టీడీపీ నాయకులు మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కస్తూరయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవాలు



దొరవారిసత్రం, జూన్ 21: మండలంలోని బుదూరులో రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అగ్నికుండ ప్రవేశం చేశారు. నెల రోజుల పాటు ఆ గ్రామంలో 70 మంది భక్తులు పాండురంగ స్వామి భజన చేస్తూ శుక్రవారం స్వామి ఉత్సవాల్లో అగ్ని తొక్కారు.

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో పాండురంగస్వామి ఆలయ అగ్నిగుండ మహోత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. శుక్రవారం సాయంకాలం భక్తులు కంకణాలు ధరించి గోవింద నామస్మరణలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.శేఖర్‌రెడ్డి, శ్రీదేవి, బియ్యపు గోవిందురెడ్డి, రమేష్‌రెడ్డి, తిరుపాలు తదితరులు ఉన్నారు.

హుస్సేనమ్మ దర్గాలో భక్తుల సందడి

దొరవారిసత్రం, జూన్ 21 : దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గాలో శుక్రవారం రాత్రి భక్తుల సందడి కన్పించింది. దర్గా ఉత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం తెల్లవారు జామున గంధం ఊరేగింపు నెలబల్లిలో జరిగింది. ఊరేగింపు అనంతరం గంధాన్ని భక్తులకు పంచి పెట్టారు. రాత్రి పరిసర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి దర్గాలో హుస్సేనమ్మకు పూజలు చేశారు. స్థానిక కళాకారులచే పాటకచ్చేరి కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ తిరుమలరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

చిల్లకూరు, జూన్ 21: మండలంలోని తిమ్మనగారిపాళెంలో విద్యుతాఘాతంతో తొమ్మిది గేదెలు మృతిచెందాయి. బాధితుల కథనం మేరకు... గ్రామానికి సమీపంలోని చెరువులో 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉండడంతో మేతకు వెళ్లి వస్తున్న గేదెలకు తగిలి మృతిచెందాయి. గ్రామానికి చెందిన యానాదిరెడ్డి చెందిన 3 గేదెలు, శ్రీనివాసులురెడ్డికి చెందిన 3, సుమన్‌కు చెందిన 2, జనార్దన రెడ్డికి చెందిన గేదె మృతిచెందాయి. దీంతో బాధితులు పోలీసులు ఫిర్యాదు చేశారు.

వెంకటగిరిలో విస్తరణకు నోచుకోని రహదారులు


పోలేరమ్మ ఆర్చి వద్ద ట్రాఫిక్ జామ్

వెంకటగిరి టౌన్, జూన్ 21: అడుగు వేస్తే ట్రాఫిక్ జాం... అడుగు తీసినా ట్రాఫిక్ జాం... వాహనం ఎదురొస్తే ట్రాఫిక్ జాం... పక్కకు వెళ్లినా ట్రాఫిక్ జామ్‌ం... ఇది వెంకటగిరి పట్టణంలో ప్రస్తుత పరిస్థితి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరణకు నోచుకోని రహదారులతో వెంకటగిరి పట్టణవాసులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. వెంకటగిరికి మున్సిపాలిటీ హోదా వచ్చి 17 సంవత్సరాలవుతోంది. సుమారు 65వేల జనాభా పైచిలుకు ఉన్న మున్సిపాలిటీ. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చిపోయే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడి నుంచి తిరుపతికి రాకపోకలు సాగుతుంటాయి. వెంకటగిరికి సమీపంలోని మేనకూరు సెజ్, వాంపల్లి వద్ద పలు కంపెనీలు, చింతలపాళెం పరిశ్రమలు రావడంతో అక్కడ పనిచేసుకుని వెంకటగిరి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల కోసం పరిశ్రమలు బస్సులు ఏర్పాటు చేయడంతో వెంకటగిరి రూపురేఖలు మారుతున్నాయి. బయట నుంచి వచ్చే బస్సులు, లారీలు గంటల తరబడి రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది.

ట్రాఫిక్ సమస్యలకు ఇవే ప్రధానం...

పట్టణంలోని ప్రధాన వీధులు రాజావీధి, తూర్పువీధి, కాశీపేట సెంటర్, త్రిభువని, క్రాస్ రోడ్డు, పాలకేంద్రం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా రద్దీగా ఉంటుంది. చిరు వ్యాపారులు సహా వాహనదారులు ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జాం అవుతోంది. రాజా వీధి, తూర్పు వీధి, దక్షిణపు వీధి, ఉత్తరపు వీధుల్లో వాహనాలు వన్‌వే నియంత్రణ చేస్తే కొంత వరకు తగ్గించవచ్చు.